# రెండో కోణం

**తమ్మినేని అక్కిరాజు**

జీవితం అనేక సంఘటనల సమాహారం. అదొక వెల్లువ. ఈ ప్రవాహంలో మనిషి ఎటు కొట్టుకుపోతున్నాడో తెలీదు. దొంగలు - దొరలు, రౌడీలు - నిజాయితీపరులు, చెడ్డ భర్తలు, మంచి భార్యలు, చెడ్డ నార్యలు - మంచి భర్తలు... అన్ని రకాల వాళ్లూ ఈ వెల్లువ నుండే ఉద్భవిస్తారు.

నిండు నూరేళ్లూ కలిసి జీవితం పంచుకోవలసిన వాళ్లు కూడా ఎవరికి వారు 'రెండో కోణం' అర్థం చేసుకోకపోతే - ఎన్నో అనుమానాలు, అపార్థాలతో జీవితాన్ని సాగదియ్యవలసి ఉంటుంది. ఇలాంటి వాళ్లు జీవితానందాన్ని జుర్రుకోవటానికి బదులు కష్టాల ఊబిలో కూరుకుపోతారు.

సరిగ్గా ఇలాంటి పరిస్థితుల్లో చిక్కుకు పోయారు మాధవీలత, వరుణ్ తేజ. వీళ్లిద్దరిది ప్రేమ వివాహం. వివాహానికి ముందు ఈ జగమంతా ప్రేమమయంగా కనిపించింది. వీళ్ల కళ్లకి ప్రేమ తప్ప ఇంకేమీ కనపడలేదు. 'ప్రేమ గుడ్డిది' అన్నారు కదా! అందుకే వీళ్లు ప్రేమాంధకారంలో చిక్కుకుపోయారు. అమ్మానాన్నలు వీళ్ల కళ్లకి అప్పుడు కనిపించలేదు.

ఎంతయినా ఆడపిల్లను కన్నవాళ్లకు ఈ వేదన ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే ఆమె ఆడపిల్ల - ఎటు పోయి ఎటు వచ్చినా దుఃఖం ఆడవాళ్లకే. ముల్లొచ్చి అరిటాకు మీద పడ్డా, అరిటాకు ముల్లు మీద పడ్డా చిరిగిపోయేది అరిటాకే! ఈ జీవన సత్యం తెలుసు కబట్టే మాధవీలత వాళ్ల అమ్మ ముందే హెచ్చరించింది. ఆమె పేరు భారతీదేవి.

'అతనితో షికార్లు మంచిది కాదు' అంది.

'లేదమ్మా! వరుణ్ చాలా మంచివాడు. నన్ను బాగా చూసుకుంటాడు' అంది లత.

'నీకు అలా అనిపించటం సహజమే! కాని బయటి నుండి చూసేవాళ్లు నిజానిజాలు బాగా అంచనా వేస్తారు. నువ్వు ట్రైనింగ్ పీరియడ్‌లో ఉండగా అతను నీ దగ్గరకు వచ్చాడు. అవునా?' అడిగింది భారతీదేవి.

'అవును వచ్చాడు'

'అలా రావటమే ఒక తప్పు. పైగా లాడ్జిలో రూమ్ బుక్ చేశాడు. నిన్ను రమ్మన్నాడు. నిజమేనా?'

'నిజమే! కాని అతనికి ఏ దురుద్దేశం లేదు'

'నీకు అలాగే అనిపిస్తుంది. నువ్వు వెళ్లలేదు కాబట్టి సరిపోయింది. వెళ్లి ఉంటే అతని నిజ స్వరూపం బయటపడేది. పైగా నీ ట్రైనింగ్ కేన్సిల్ అయ్యేది. నీ ఉద్యోగం ఊడిపోయేది. ఇవన్నీ అతను ఆలోచించాడా?'

'నిజమేనమ్మా! కాని అతను నా మీద ప్రేమతో అలా చేశాడు తప్ప ఇదంతా అతను ఆలోచించలేదు'

'అదే నేను చెబుతున్నది. నిజమైన ప్రేమికుడు తన కోణంలోనే తాను ఆలోచించడు. 'రెండో కోణం' కూడా ఆలోచిస్తాడు. తాను 'సగం' అయితే - రెండో సగం భార్య. ఆ స్థానంలోకి నువ్వు రావాలని అతను మనస్ఫూర్తిగా భావిస్తే అలాంటి పొరపాటు పని చేయడు'

'నేను చెప్పగానే అతను తన తప్పు తెలుసుకున్నాడు. ఆ కోణంలో తాను ఆలోచించలేదని, తనను క్షమించమని చెప్పి వెంటనే వెళ్లిపోయాడు. మంచివాడు కాబట్టే కదా అలా చేశాడు' అంది లత.

'నువ్వు రానని తిరస్కరించటం నీ సంస్కారం. దాని వల్ల అతను వెళ్ళిపోయాడు. లేకపోతే ఏమయ్యేది? కచ్చితంగా అతనిది కామం తప్ప ప్రేమ కాదు' అంది భారతీదేవి.



ఆ క్షణం వాళ్ల అమ్మగారితో ఇంకేమీ మాట్లాడలేక పోయింది.

లత మద్రాసులో బ్యాంక్ ఆఫీసర్‌గా ట్రైనింగ్‌లో ఉండగా వరుణ్ ఢిల్లీ నుండి ఫ్లైట్‌లో మద్రాసు వెళ్లాడు. ఆ సంఘటన లత కళ్ళకు, హృదయానికి అనొక 'గ్రేట్ లవర్'గా అనిపించింది. కాని వాళ్ల అమ్మగారు చెప్పే రెండో కోణం ఆమె కూడా ఆలోచించనే లేదు.

ఇంతకంటే దారుణమైన మరో 'సంఘటన' గురించి వాళ్ల అమ్మగారు ఎంతో కలత చెందారు. అప్పటికి లత ట్రైనింగ్ పూర్తయి, బాంబేలో ఉద్యోగంలో చేరింది. ఆమె మనసులో వరుణ్ ఒక 'డ్రీమ్ బాయ్' ఒక గ్రీకు వీరుడు... ఆ పరవశంలోనే ఉంది.

ఒకరోజు ఆమె వంట చేస్తూ ఉండగా ఆమె చేతిపై తాలింపు వేస్తున్న గిన్నె తిరగబడిపోయింది. అందులోని బాయిల్డ్ ఆయిల్ వొలికిపోయింది. కుడిచేతి వేళ్లు బాగా కాలిపోయాయి. పెద్దపెద్ద బొబ్బలొచ్చాయి. తన పనులు తాను చేసుకోలేక వాళ్ల అమ్మగారిని రమ్మని ఫోన్ చేసింది.

ఆంధ్రాలో ఎక్కడో మారుమూల గ్రామం నుంచి బయలుదేరి వెళ్ళింది భారతీదేవి. కూతురి బాధను చూసి హృదయం తల్లడిల్లిపోయింది. ఆసుపత్రికి తీసుకువెళ్ళగా డాక్టర్ ఆ బొబ్బలను కత్తిరించి కట్టు కట్టేసరికి, దాదాపు ఒక ఆపరేషన్ అంత పని అయింది. ఇంజక్షన్లు, మాత్రలు రోజూ వేళ ప్రకారం ఇచ్చింది. వారం రోజుల తరువాత కాస్త మెరుగయింది. అయినా ఆ చెయ్యి ఒక మాంస ఖండంలాగ ఎర్రగా ముద్దలానే ఉంది. ఢిల్లీలో ఉన్న వరుణ్ వెబ్ కెమెరాలో ఆమె చెయ్యి చూశాడు. ఎంతో బాధపడ్డాడు.

కాని - అంత బాధపడ్డవారు రెండో రోజునే లతకు ఫోన్ చేసి 'మా అక్క, బావ బొంబాయి వస్తున్నారు. వాళ్లను రిసీవ్ చేసుకొని బొంబాయి చూపించు లతా' అన్నాడు. అంతేకాదు వాళ్లకు ఫోన్ చేసి బాంబే వస్తే నీ ఫ్లాట్‌కు రమ్మని ఆహ్వానించమన్నాడు. లత అలాగే చేసింది. రాకరాక వాళ్లు బాంబే వస్తే తాను చూపించకపోతే ఎలాగ? అనుకున్నదే కాని - తాను ఇంత కష్టంలో ఉండగా ఇలా చేశాడేమిటి? అని కొంచెం కూడా ఆలోచించలేదు. వరుణ్ ఫోన్ చెయ్యటానికి ముందు రోజే భారతీదేవి తన స్వగ్రామం వెళ్ళిపోయింది. అందువల్ల లతకు చెప్పే వాళ్లే లేకపోయారు.

డిసెంబర్ నె. విపరీతమైన చలిగాలి. ఉదయం ఐదు గంటలకు వాళ్ళ అక్క, బావ 'కుర్లా' స్టేషన్‌లో ఉన్నామని ఫోన్ చేశారు. లత ఆ చలిగాలిలో 'అంధేరీ' నుండి ఆటోలో వెళ్ళి వాళ్లను రిసీవ్ చేసుకుంది. వారిని చూసి లత ఆనందం ఆహ్వానించిందే గాని - ఏమీ ఆందోళన చెందలేదు. బ్యాంకుకు నాలుగు రోజులు సెలవు పెట్టి వాళ్లకు బాంబే అంతా చూపించింది. ఆ చేతి గాయంతోనే తాను అలాగే తిరిగింది.

... ఈ విషయాలన్నీ తన కూతురు ద్వారానే తెలుసుకున్న భారతదేవి కోపం తారాస్థాయికి పోయింది. 'అతని మీద ఉన్న వ్యామోహంతోనే ఇలాంటి పిచ్చిపనులు చేస్తున్నావు' అని తిట్టింది.

'అసలు వాళ్లెవరు నీ ఇంటికి రావటానికి! వాళ్లతోపాటువాళ్ల పిల్లలు, వాళ్ల అమ్మానాన్న కూడా వచ్చారంటున్నావు! వాళ్లకెంత సిగ్గు లేదు? నువ్వు వాళ్లకేమవుతావని వచ్చారు? పైగా నువ్వు వాళ్లను ఫోన్ చేసి ఆహ్వానించటం ఏమిటి? సందర్భం వస్తే 'నువ్వు పిలవబట్టే మేము వచ్చాము' అనటానికా? అంత బాధలో నువ్వు ఉంటే వాళ్ళందర్నీ నీ నెత్తి మీద ఎక్కించటానికి అతనికి మనసెలా వొప్పింది? ఇదంతా ప్రేమంటావా? అతనికి తన వాళ్ళ మీద ఉన్న ప్రేమలో అణుమాత్రమైనా నీ మీద ఉంటే ఇలా చేసేవాడే కాదు. అయినా నీ తెలివంతా ఏమయింది?' అని తీవ్ర స్వరంతో ఛడామడా తిట్టింది. ఫోన్‌లోనే తన కూతురు జీవితం ఏమయిపోతుందోనన్న బాధతో వెక్కివెక్కి ఏడ్చింది.

* * *

ఆ రోజు తన తల్లి ఏడ్చిన ఏడ్పులోని అంతరార్థం సంవత్సరం తరువాత లతకు అర్థమయింది. ఈ సంవత్సరంలో తన జీవితంలో ఎన్నో సంఘటనలు జరిగిపోయాయి. వరుణ్‌కు తనకు లండన్‌లోని ఒక ఇంటర్నేషనల్ బ్యాంకులో ఉద్యోగాలు వచ్చాయి. వారు లండన్‌లో ఉంటూనే అక్కడే వివాహం చేసుకున్నారు.

'ఈ వివాహం' జరిగిన తరువాత భారతీదేవి కొంత సంతృప్తితో ఊపిరి పీల్చుకుంది. కాని ఏవో తెలియని భయాలు, అనుమానాలు ఆమెను వెంటాడుతూనే

ఉన్నాయి. పెళ్ళి కాకముందే అత్తగారు, మావగారు, ఆడపడుచు, ఆడపడుచు మొగుడు కూడా బొంబే వెళ్ళి తన కూతురు ఇంట్లో ఉండటం ఆమెకు నచ్చని విషయం. ఆనాడే వాళ్ళ 'సంస్కారం' ఆమెకు రోత కలిగించింది.

ఆమె అనుమానాలే నిజమవుతూ వచ్చాయి. 'కులం' లేకపోయినా 'కట్నం' లేకపోతే ఎలాగ? అన్నాడట వాళ్ళ మామగారు. అలాంటి మాట అన్నాడంటే అతను ఏ రకం మనిషి అనుకోవాలి? అతను సంప్రదాయానికి విలువ ఇచ్చేవాడు కాదని తెలిపోయింది. సంప్రదాయాన్ని పాటించేవాడైతే 'కులం' ముఖ్యం' కాని 'కట్నం'దేముంది?' అనేవాడు. కులాంతర వివాహం చేసుకున్న కొడుకుతో మాట్లాడటానికి కూడా వ్యతిరేకించేవాడు. తన గుమ్మంలో కాలు పెట్టొద్దని ఆంక్షలు పెట్టేవాడు. కాని కట్నం ఆశించటంతో అతను పూర్తిగా డబ్బు మనిషి అని తెలిపోయింది. తనకు ఒంట్లో బాగా లేదని, అమ్మకు జబ్బు చేసిందని, అక్కయ్య వివాహం సందర్భంగా మనం కొంత డబ్బు బాకీ పడి ఉన్నామని, ఏవో కోర్టు గొడవలున్నాయని... అనేక రకాలుగా చెప్పి లండన్‌లో ఉన్న కొడుకు దగ్గర నుండి లక్షలకు లక్షలు గుంజుకుపోవటమే అతని పని.

ఇక్కడే లతకు, వరుణ్‌కు అభిప్రాయ భేదాలు మొదలయ్యాయి.

'కన్న వాళ్ళకు ఆ మాత్రం చెయ్యలేమా?' అంటాడు వరుణ్.

'చెయ్యొచ్చు - కాని అవి అన్నీ వట్టి కట్టుకథలని తెలుస్తున్నా కూడా నువ్వు డబ్బు పంపటం కరెక్టు కాదు' అంది లత.

ఆ క్షణం అతను 'సరే' అని ఊకొట్టినా తిరిగి అలాగే ప్రవర్తిస్తున్నాడు. అదే లతకు అర్థం కాలేదు. అమ్మ ఎన్నిసార్లు చెప్పినా సరే తాను వరుణ్ కోణం నుంచే ఆలోచించింది తప్ప - అమ్మ కోణం నుంచి ఆలోచించనే లేదు. వరుణ్ మాత్రం ఎప్పుడూ వాళ్ల కుటుంబం గురించే ఆలోచించాడు తప్ప - తన గురించి ఏనాడూ ఆలోచించలేదని ఆమె అనుకుంది. వరుణ్ ఇలాంటి వాడని తెలిసే అమ్మ అంత ఏడ్చిందని తొలిసారిగా లత భావించింది.

ఒకసారి వాళ్ళిద్దరి మధ్య పెద్ద తగాదా అయింది. ఇద్దరూ చాలా మాటలు అనుకున్నారు.

'నువ్వు ఎడ్యుకేటెవ్‌గా బిహేవ్ చెయ్యటం లేదు' అంది లత.

'నువ్వు ఆడదానివి, ఆడదానిలా ఉండటం నేర్చుకో' అన్నాడు వరుణ్.

'అంటే నువ్వు చెప్పినట్లు పడి ఉండమనేగా. నేనేమీ చదువు సంధ్యలు లేని దానను కాను. నువ్వెంత చదివావో - నేనూ అంతే చదివాను. నువ్వు ఏ ఉద్యోగం చేస్తున్నావో - నేనూ అదే ఉద్యోగం చేస్తున్నాను. నువ్వెంత సంపాదిస్తున్నావో - నేనూ అంతే సంపాదిస్తున్నాను' అంది లత.

'ఇదంతా మీ అమ్మ ఎక్కిస్తోంది నీకు' అంది లత.

'నిజమే. మా అమ్మ నాకు ఎన్నో చెప్పింది. ఆమె మాటలు విని ఉంటే ఇలాంటి వేదన అనుభవించేదానను కాదు' అంది లత.

'ఇప్పుడు నువ్వు అనుభవిస్తున్న వేదన ఏంటి? నాలో ఏమన్నా బ్యాడ్ హేబిట్స్ ఉన్నాయా - చూపించు'

'బ్యాడ్ హేబిట్సే ఉండక్కరలేదు. నీ 'అతి వినయం...' నేను అర్థం చేసుకోలేక పోయాను. నీలో స్త్రీ పురుష సంబంధాల పట్ల ఎంతో అవగాహనా లోపం ఉంది. ఆడది తక్కువ, మగాడు ఎక్కువ అన్న పాతకాలపు అహంభావం నీలో పోలేదు. అందుకే ఆడదానిని ఆడదానిగా ఉండమన్నావు. నువ్వు చెప్పినట్లల్లా నేను చెయ్యటం తప్ప - నేను చెప్పేది ఒక్క మాట కూడా కనీసం వినటం లేదు. అసలు 'నువ్వు నాకు చెప్పటం ఏంటి?' అన్నట్టుగా చూస్తున్నావు. భార్యాభర్తలన్న తరువాత ఏ సమస్యనన్నా ఇద్దరం కలిసి ఆలోచించుకోవాలి'



'అంటే నువ్వు చెప్పినట్లు పడి ఉండమనేగా. నేనేమీ చదువు సంధ్యలు లేని దానను కాను. నువ్వెంత చదివావో - నేనూ అంతే చదివాను. నువ్వు ఏ ఉద్యోగం చేస్తున్నావో - నేనూ అదే ఉద్యోగం చేస్తున్నాను. నువ్వెంత సంపాదిస్తున్నావో - నేనూ అంతే సంపాదిస్తున్నాను'

'నీతో నేను ఏవీ ఆలోచించటం లేదు. నువ్వనేది మా అమ్మా నాన్న విషయంలోనేగా?'

'అవును. మీ అమ్మ నాన్న నీ మీద చూపిస్తున్నది ప్రేమ కాదు - పచ్చి స్వార్థం'

'నోర్మూసుకో! దేవతల్లాంటి మా అమ్మానాన్నను స్వార్థపరులంటావా?'

'కాకపోతే ఏమిటి? మీ ఊళ్లో సొంత ఇల్లు ఉంది. ఇంటి ముందు షాపులు ఉన్నాయి. ఇంటి అద్దెలు, షాపు అద్దెలు కలిపి ప్రతి నెల ఇరవై వేలు ఆదాయం వస్తుంది. అదంతా ఏమైపోతోంది? ప్రతి నెల ఏదో ఒక సాకు చెప్పటం - నువ్వు వాళ్లకు వేలకు వేలు పంపటం. ఈ డబ్బంతా ఏం చేస్తున్నారు? ఇదంతా కూతురుకు పెట్టుకోవటమేగా వాళ్ల పని! కొడుకువని నీ మీద రవ్వంత ప్రేమ కూడా లేదు. ప్రేమే ఉన్నవాళ్లయితే నిన్ను ఇంత పీడించరు'

'నీ ఏడుపంతా నాకు తెలుసులే' అని వరుణ్ అక్కడి నుండి బయటకు వెళ్ళిపోయాడు.

జరిగిన సంఘటన గురించి లత అమ్మకి ఫోన్‌చేసి చెప్పింది.

'పిచ్చిదానా! నువ్వు డబ్బు గురించే అతనితో వాదించావు. కానీ ఇంతకు మించిన అన్యాయం నీకు జరుగుతుందని నా భయమంతా! వాళ్ల అమ్మ నాన్న అతనిని ఎలాగైనా ఒప్పించి వాళ్ళ కులంలోనే మరో పెళ్ళి చేస్తారు. వాళ్ల నాన్నకు ముప్పై లక్షల కట్నం కావాలి. ఇదో రకం కట్నం వేధింపు' అంది భారతీదేవి ఫోన్‌లో.

ఆ మాటలకు చలించిపోయింది లత.

'అలా ఎప్పటికీ జరగదమ్మా! ఒకవేళ వాళ్లు అలాంటి ప్రయత్నం చేసినా - వరుణ్ అందుకు మాత్రం అంగీకరించడు' అంది లత.

'పెళ్ళి కాకముందు నేను నీకు అనేక విషయాలు చెప్పాను. వాళ్లలో సంప్రదాయం లేదు. సంస్కారం లేదు. కనీస విలువలు లేవు. మానవత్వం అసల్లేదు. వొట్టి డబ్బు మనుషులని చెప్పాను. నువ్వు నా మాట విన్నావా? ఇప్పుడు అవి అన్నీ నిజమయ్యాయా లేదా? అంతా నీ ఖర్మ. ఆ దేవుడు ఎలా రాస్తే అలా జరుగుతుంది. నిండా మునిగిన వాళ్లకు చలేమిటి? నేను త్వరలో నీ దగ్గరకు వస్తాను. నువ్వేమీ భయపడకు' అని చెప్పి ఫోన్ పెట్టేసింది భారతీదేవి.

ఫోన్ పెట్టేసిందే కాని - ఆమె గుండెల్లో దిగులు మరీ పెరిగిపోయింది. ఆమె అనుమానాలు ఒక్కొక్కటి నిజమవ్వటంతో - తన కూతురు సంసారం ఏమవుతుందా అన్న బాధ ఆమె గుండెల్ని పిండేస్తోంది.

❊ ❊ ❊

లత, వరుణ్ వారం రోజులు మౌనంగానే గడిపేశారు. ఎవరి డ్యూటీ వాళ్లు చేసుకోవటం తప్ప నోరు విప్పి పలకరించుకోలేదు. ఎవరి కారులో వాళ్లు ఆఫీసుకు వెళ్ళటం - రావటం - హోటల్లో భోజనం చెయ్యటం.

ఒకరోజు వరుణ్ లత దగ్గరకు వచ్చి-

'నేను ఇండియా వెళ్లాలి' అన్నాడు.

ఆ మాటతో లత గతుక్కుమంది.

'ఎందుకు?' భయంతో అడిగింది.

'లతా! నువ్వెందుకంత భయపడుతున్నావు? నేను మా అమ్మా నాన్న విషయంలో తప్ప నిన్ను ఏ విషయంలోనైనా నెగ్లెక్ట్ చేశానా?' అంటూ దగ్గరకు వచ్చాడు.

'అసలు విషయం చెప్పు. ఇండియా దేనికి?'

'నాన్నకు సీరియస్‌గా ఉందంట - నువ్వు కూడా రావాలి' అన్నాడు.

'మీ నాన్నకు ఏమిటంత సీరియస్? నిన్నటి దాకా బాగానే ఉన్నాడుగా'

'ఆయన షుగర్ పేషెంట్. నీకు తెలుసు. ఈ మధ్య బాగా పెరిగిందట. మందులు ఎక్కువగా వాడటంవల్ల ఐసైట్ బాగా దెబ్బ తిందట'

'ఇలాంటివి వాళ్లు ఎన్నిసార్లు చెప్పలేదు. అక్కడ డాక్టర్లు లేరా? మందులు లేవా? నువ్వెళ్లి ఏం చేస్తావు?'

'అది కాదు లతా! కన్న బిడ్డలు దగ్గరుంటే పేరెంట్స్‌కు కొంత 'హోప్‌ఫుల్'గా ఉంటుంది కదా!' అన్నాడు వరుణ్.

'అలాగా! సరే నువ్వెళ్లు. నాకు రావటం కుదరదు. నా జాబ్ రిస్క్‌లో ఉంది. ఈ పీరియడ్‌లో నేను కదిలితే జాబ్ పోవచ్చు కూడా. నేను రాలేను. అయినా కన్నబిడ్డవు నువ్వుండగా నేనెందుకు?' అంది లత.

'మరి నువ్వు ఒక్కదానివే ఎలా ఉంటావు'

'అది నీకు అవసరం లేదు కదా'

'ప్లీజ్ లతా! అంతంత మాటలని నన్ను బాధపెట్టొద్దు. నాకు నువ్వు కావాలి. నీ ప్రేమ కావాలి'

'ఆ మాట మీదే ఉండు చాలు' అంది లత.

లతకు చెప్పిన మాటలు పదేపదే గుర్తుకొస్తున్నాయి. అలాగే జరిగితే - వరుణ్ ఇండియాలో రెండో పెళ్ళి చేసుకుంటే - తన జీవితం ఏమిటి?

❊ ❊ ❊

(తరువాయి 27 వ పేజీలో)

# గిలిగింతల 'గోపాలం'


కారణాలేవైనా తెలుగులో నవ్వించే కథలు తగ్గిపోతున్నాయి. హాస్యప్రియులు నిరుత్సాహ పడుతున్నారు. ఎనుగంటి వేణుగోపాల్ నేనున్నానని హామీ ఇచ్చి 'గోపాలం' - హాస్యకథల సంపుటి - అందించారు. ఈయన కలం బాగా గిలిగింతలు పెడుతుంది.

ఈ సంపుటిలో పన్నెండు కథలున్నాయి. అన్నింటిలోనూ ముఖ్య పాత్ర పేరు గోపాలమే. కొన్నింటిలో ఇంకా పెళ్లికాని యువకుడు. ఎక్కువ కథల్లో నడివయస్సు గృహస్థు. సన్నివేశ చిత్రణలోను, పదప్రయోగంలోను హాస్యం పొంగులు వారుతుంది. పసలేని యముని శిక్షలు, పసికూన చదువు, ముదిరిన బ్రహ్మచారి, వంటచేసే భర్త, తన కుటుంబ భారం మోయమన్న ప్రియురాలు, ఆఫీసులో తన వస్తువులు ముట్టకూడదన్న సూపరింటెండెంట్, వింత అభిరుచులున్న భార్య, కవిత రాయాలనే పిచ్చి, స్పాట్‌వాల్యుయేషన్ 'కీ' పేపరు దిద్దిన ఘనుడు, పని చేయించుకుని మేలుచేసే బాసు, నీటి కటకట, సెల్‌ఫోను తిప్పలు - ఇతివృత్తాలుగా అల్లిన కథలు. మంచి శిల్పం నింపుకున్నాయి. కొన్ని కథల్లో వూహించని ముగింపుతో పాఠకుల్ని ఆశ్చర్యపరుస్తారు. 'వీరివీరి గుమ్మడి వీరి బాధేంటి' కథలో భర్త వంట చేయడానికి కారణం భార్య మృత్యుముఖంలో వుందని చివర చెబుతారు. 'బాపు' ముఖచిత్రంతో పుస్తకాన్ని అందంగా రూపొందించారు.

**గోపాలం**
**హాస్య కథల సంపుటి**
**-ఎనుగంటి వేణుగోపాల్**
**పుటలు: 100. వెల: రూ.70**
**ప్రతులకు: అంజలి పబ్లికేషన్స్, 1-3-169/ఎ/1, కృష్ణనగర్ జగిత్యాల - 505 327.**




**-జిఆర్కె**



**మణిదీపికలు**
మంచిమాటలు..సూక్తులు
-మామిడి
వెల: రూ.57/-
ప్రతులకు: మామిడి భాస్కరరావు, అనుముల్లంక గంపలగూడెం మండలం, కృష్ణాజిల్లా.



**స్మైలీ** (కవితా సంకలనం)
-తోటకూర వేంకట నారాయణ
వెల: రూ.30/-
ప్రతులకు: తోటకూర రామసీత
3-170, 5వ లైన్, పండరీపురం,
చిలకలూరిపేట - 522 616



**మేఘం**(వచన కవితాసంపుటి)
-వేంపల్లి అబ్దుల్ ఖాదర్
వెల: రూ.50/-
ప్రతులకు:విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలూ, ప్రజాశక్తి బుక్‌హౌస్, నవయుగ బుక్‌హౌస్, నవోదయ బుక్‌హౌస్.

**( 21 వ పేజీ తరువాయి)**

వరుణ్ ఇండియా వెళ్ళిన మరుసటి రోజే లత వాళ్ల అమ్మగారు లండన్ వచ్చారు. కూతురును దగ్గరకు తీసుకుని ఓదార్చారు.

'చేసుకున్న వాళ్ళకు చేసుకున్నంత. ఇప్పుడు బాధపడి లాభం ఏముంది? ఏది ఎలా జరగాలో ఆపై వాడే చూసుకుంటాడు' అంటూ లతను తన ఒళ్లోకి తీసుకుంది భారతీదేవి.

నాలుగు రోజులు దుఃఖంతోను, కన్నీళ్లతోను, బరువు గుండెలతోను కాలం గడిపారు తల్లీ కూతుళ్లు.

సరిగ్గా ఐదవ రోజున వరుణ్ లండన్ తిరిగి వచ్చేశాడు. అతను పదిహేను రోజులు సెలవుపై ఇండియాలో ఉండేందుకు వెళ్ళాడు.

వరుణ్‌ని చూసి లత, భారతీదేవి ఆశ్చర్యపోయారు.

కాని వరుణ్ మాత్రం లతతో వాళ్ళ అమ్మగారు ఉన్నందుకు ఆనందించాడు. అయినా అతని ముఖంలో ఎంతో ఆవేదన కనపడుతోంది. కళ్లలో చాలా దీనత్వం ఉంది. భారతీదేవి వద్దకు వెళ్ళి-

'ఆంటీ నన్ను క్షమించండి. ఇన్నాళ్లు నేను మిమ్మల్ని అపార్థం చేసుకున్నాను. నా వాళ్ళే నాకింత అన్యాయం తలపెడతారని కలలో కూడా ఊహించలేదు' అన్నాడు.

'ఏం జరిగింది బాబు' అంది భారతీదేవి - లోపలలోపల భయపడుతూనే.

'నేను వాళ్ళకి డబ్బు ఇవ్వటానికి ఎప్పుడూ వెనకాడలేదు. కాని నా హృదయంలో లతకు తప్ప మరెవ్వరికీ స్థానం లేదు' అంటూ ఘొల్లున ఏడ్చాడు వరుణ్.

ఆ క్షణాలు భారతీదేవికి, లతకు కూడా ఎంతో వేదన కలిగించాయి.

కొన్ని క్షణాల తరువాత రిలాక్స్ అయి - జరిగినదంతా చెప్పాడు.

'లతను వదిలేసి నన్ను రెండో పెళ్ళి మా కులంలోనే చేసుకోమని నిర్బంధించారు మా వాళ్లు. ముప్పై లక్షల కట్నం వస్తుందన్నారు. సగం కట్నం అడ్వాన్సుగా ఇప్పించటానికి బ్రోకర్ రెడీగా ఉన్నాడన్నారు. అప్పటికి వాళ్ల నిజ స్వరూపాలు బయటపడ్డాయి. నేను లతను ప్రాణంగా ప్రేమించాను. ఆ పిచ్చి ప్రేమతోనే - నా భార్య అందమైనది. సంస్కారవంతురాలు అని మా వాళ్లకు చూపించటానికే, నేను ఆనాడు బాంబేలో లత పరిస్థితి తెలిసి కూడా అమానుషంగా ప్రవర్తించాను. కాని లత, మీరు ఎంత బాధపడతారోనన్న కోణంలో నేను ఆలోచించలేదు. ఇప్పుడు మా వాళ్ల ప్రవర్తన నా కళ్లు తెరిపించింది. అందుకే వెంటనే తిరిగి వచ్చేశాను. ఇన్నాళ్లు నేను మిమ్మల్ని బాధ పెట్టినందుకు నన్ను క్షమించండి ఆంటీ' అంటూ వరుణ్ భారతీదేవి పాదాల ముందు మోకరిల్లాడు.

'వద్దు బాబూ వద్దు. నీలో ఇంత గొప్ప మనిషి ఉన్నాడని నేనూ ఊహించలేదు. ఎన్నో అనుమానాలతో ఈ క్షణం వరకు బాధ పడుతూనే ఉన్నాను. నువ్వు ఇప్పుడు అన్నట్టుగా - ఏనాడూ నువ్వు లత కోణం నుండి ఆలోచించక పోవటం వల్లనే - ఇన్ని భయాలు, అనుమానాలు ఏర్పడ్డాయి. ఏ పని చేసినా తన జీవితంలో భాగం అయిన భార్యను ఎప్పుడూ నిర్లక్ష్యం చెయ్యకూడదు. ఈ సత్యం చెప్పటానికే అర్ధనారీశ్వరుడి రూపాన్ని మనకు అందించారు మన పెద్దలు. ఏ సమస్య ఎదురైనా నీ కోణం నుంచే కాదు - రెండో సగం అయిన నీ భార్య కోణం నుంచి కూడా ఆలోచించి నిర్ణయాలు తీసుకున్నప్పుడే మంచి ఫలితాలు వస్తాయి. ఆ జీవితాలు ఆనందమయమవుతాయి' అంది భారతీదేవి.

'ఇక నుండి లతను విడిచి ఒక్క క్షణం కూడా విడిచి ఉండను. ఆమెతో సంప్రదించే నిర్ణయాలు చేస్తాను' అంటూ లతను దగ్గరకు తీసుకున్నాడు వరుణ్.

ఆ క్షణాల కోసమే ఎదురుచూస్తున్న భారతీదేవి నిన్నటి దుఃఖం, నేటి ఆనందం కలిసిన కన్నీటిని తన చీర కొంగుతో తుడుచుకుంది.

రచయిత చిరునామా:
**తమ్మినేని అక్కిరాజు**
తెలుగు డిపార్ట్‌మెంట్
భాష్యం పబ్లిక్ స్కూల్
భాష్యం టీచర్స్ కాలనీ
గోరంట్ల - గుంటూరు